# Valedictory of
# 9th National Conference of Telugu Linguist's Forum (TeLF)

08.03.2018

తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక 9వ జాతీయ సదస్సు ముగింపు సమావేశం గురువారం ఎమెనో భవనంలో జరిగింది. ఈ ముగింపు కార్యక్రమంలో వర్సిటీ లింగ్విస్టిక్స్ విభాగాధిపతి స్వాగతం పలుకగా, సభాధ్యక్షులుగా రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జి.బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ.... ఆంగ్ల భాషా ప్రభావాన్ని ప్రాంతీయ భాషల ప్రాధాన్యత తగ్గుతోందని, ఈ ప్రభావం ఒక తెలుగుపైనే కాకుండా ఇతర అన్ని ప్రాంతీయ భాషలపై ప్రభావం చూపుతుందని అన్నారు. దీనికి పరిష్కారంగా ఆయా ప్రాంతీయ భాషాభిమానులు ఇకనైనా మేల్కొని దక్షిణాది రాష్ట్రాలలో తమ ప్రాంతీయ భాషలో విద్యను ఒకటవ తరగతి నుండి 12వ తరగతి వరకు తప్పకుండా అమలు పరిచినట్లైతే కొంతవరకైనా ఈ ఆపద నుంచి బయటపడవచ్చని అన్నారు. అదేవిధంగా గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు గారు మాట్లాడుతూ.... అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీషు ప్రభావానికి ప్రాంతీయ భాషలు మరుగున పడటం వాస్తవమైనప్పటికీ ప్రాంతీయ భాషాభిమానులు వారి భాషపై ప్రాథమిక విద్యలో పట్టుసాధించి తదనంతరం ఇతర భాషల్లో ఉన్నత విద్యను అభ్యసించడం వల్ల వచ్చే నష్టమేమీలేదని అన్నారు. అనేక భాషలు నేర్చుకోవడం వలన ఒక భాషలోని సమాచారాన్ని ఇంకో భాషలోకి అనువాదం చేసి పాఠకులకు అందించినవారము అవుతామని అన్నారు. ఆత్మీయ అతిథిగా వర్సిటీ అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.పెంచులయ్య మాట్లాడుతూ... తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక ఈ నాటి ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు భాషను కాపాడుకోవడానికి, తెలుగు సాహిత్యాన్ని పరిరక్షించుకోవడానికి, తెలుగు భాషపై అనేక కోణాల్లో పరిశోధనలు జరిపి తెలుగు భాష యొక్క ఉనికిని చాటుకోవడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ ముగింపు సమావేశంలో తెలుగు భాషా వేదిక కార్యదర్శి ఆచార్య హయత్ సమాపన ప్రసంగం ఇచ్చారు. అనంతరం డా.ఎమ్.సి.కేశవమూర్తి గారు వందన సమర్పణ చేశారు. 7, 8 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో ఆచార్య బి.రామక్రిష్ణారెడ్డి, ఆచార్య విశ్వనాథ, ఆచార్య ఉమామహేశ్వర్, ఆచార్య పెరుమాళస్వామి, పరిశోధకులు తమ విలువైన సదస్సు పత్రాలను సమర్పించారు.

